# సాక్షి
## తూర్పుగోదావరి

గురువారం । 12 । డిసెంబర్ । 2024






### వెదజల్లుతో సిరుల పంట

గడచిన కొన్నేళ్లుగా వరి సాగులో వెదజల్లు పద్ధతి బాగా ప్రాచుర్యం పొందింది. నారు మడి పెంచి, నాట్లు వేయకుండా నేరుగా విత్తే పద్ధతి (వెదజల్లు) పాటిస్తే, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు.


8లో



### జల్సాల కోసం చోరీల బాట

జల్సాలు, దుర్వ్యసనాలకు గురైన నలుగురు యువకులు చోరీల బాట పట్టారు. అనేక ద్విచక్ర వాహనాలను దొంగిలించి, తుదకు పోలీసులకు పట్టుబడ్డారు.

### 11,200 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 11,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### రైల్వేగేటు మూసివేత

నిడదవోలు : తాడేపల్లిగూడెం - నిడదవోలు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో నెహ్రూ బొమ్మ సెంటర్‌లో రైల్వే పట్టాల మరమ్మతుల కోసం బుధవారం రాత్రి 10 గంటలకు రైల్వేగేటును అధికారులు మూసివేశారు. మరమ్మతులు పూర్తి చేసి గురువారం రాత్రి 10 గంటలకు గేటును తిరిగి తెరుస్తామని ప్రకటించారు.

### సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు

అమలాపురం రూరల్: బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియా దేశంలోని రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు బుధవారం ఇక్కడ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఓంక్యాప్, అల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో ఈ నియామకాలు చేస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనికి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు, బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ చదివి ఉండాలన్నారు. ఏదైనా ఆస్పత్రిలో ఏడాదిన్నర పాటు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. వీసా, విమాన టికెట్లతో కలిపి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.37,500 చెల్లించాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.78 వేల నుంచి రూ.89 వేల వరకూ జీతం వస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం rkilinternationa@aprrdc.in మెయిల్ ఐడీకి రెజ్యూమ్ పంపించాలని తెలిపారు. వివరాలకు 99888 53335, 95814 22339 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చని హరిశేషు తెలిపారు.

### ప్రభుత్వ కార్యాలయాలపై కూటమి నేతల పెత్తనం వద్దు

మంత్రి సుభాష్ కార్యాలయం ప్రకటన

రామచంద్రపురం: కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకులు రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలపై ఎటువంటి పెత్తనం చేయవద్దని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన వెలువడింది. మంత్రికి, మంత్రి కార్యాలయానికి తెలియకుండా ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి కూటమి నాయకులు ఎటువంటి ఆదేశాలు జారీ చేయరాదని పేర్కొంది. అదే విధంగా నియోజకవర్గంలోని పాఠశాలలు, ఆసుపత్రులు తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో మంత్రి దృష్టికి తేకుండా ఎటువంటి ఆకస్మిక తనిఖీలు చేయకూడదని తెలిపింది.

### రత్నగిరికి భక్తుల తాకిడి



సత్యదేవుని ఆలయం వద్ద క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయానికి మార్గశిర శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవ దంపతులు, వారి బంధుమిత్రులతో కలిసి సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. బుధవారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కాగా మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవికి బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర పూజ చేశారు.

# పింఛన్ల వెరిఫికేషన్

- అభాగ్యుల సామాజిక భద్రత పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం కుట్ర
- అనర్హుల గుర్తింపు పేరుతో వెరిఫికేషన్ ప్రక్రియ
- సర్వేకు 12 మంది అధికారులతో బృందం
- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తాడిమళ్ల-1 సచివాలయం
- పూర్తయిన తనిఖీ.. ప్రభుత్వానికి నివేదిక
- సర్వేపై లబ్ధిదారుల్లో ఆందోళన

| | | |
|---|---|---|
| తాడిమళ్ల-1లో వెరిఫికేషన్ చేసిన పింఛన్లు | : | 472 |
| వృద్ధాప్య | : | 237 |
| వితంతు | : | 98 |
| కల్లుగీత | : | 16 |
| మత్స్యకారులు | : | 17 |
| దివ్యాంగ | : | 69 |
| డప్పు కళాకారులు | : | 1 |
| ఒంటరి మహిళ | : | 19 |
| అభయహస్తం | : | 4 |
| కిడ్నీ | : | 2 |
| ఇతర | : | 9 |

సాక్షి, రాజమహేంద్రవరం: సామాజిక భద్రత పింఛన్లపై కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. అభాగ్యుల నోటికాడ కూడును లాగేసేందుకు పావులు కదుపుతోంది. లబ్ధిదారుల సంఖ్య కుదించేందుకు కసరత్తు చేపడుతోంది. అనర్హుల గుర్తింపు పేరుతో ఉన్న పింఛన్ల ఏరివేతకు వ్యూహం రచిస్తోంది. ఇందులో భాగంగానే సామాజిక భద్రత పింఛన్ల తనిఖీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఓ గ్రామ సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఆ సచివాలయం పరిధిలో అందుతున్న పింఛన్లపై వెరిఫికేషన్‌కు నాంది పలికింది. ఇప్పటికే జిల్లాలో ఈ ప్రక్రియ ముగిసింది. పింఛన్ల పరిశీలనకు నియమితులైన అధికారుల బృందాలు తనిఖీ పూర్తి చేశారు. పరిశీలనలో గుర్తించిన అంశాలు ప్రభుత్వానికి నివేదించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల తొలగింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ పరిణామం పింఛనుదారులను ఆందోళనకు గురిచేస్తోంది. మంచి ప్రభుత్వమని చెప్పుకుంటూ ముంచే పనులు చేస్తోందని మండిపడుతున్నారు.

**తాడిమళ్ల-1 సచివాలయం పరిశీలన**

పింఛన్ల తొలగింపులో భాగంగా కూటమి ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లాలో తాడిమళ్ల-1 గ్రామ సచివాలయాన్ని ఎంపిక చేసింది. తనిఖీలకు సంబంధించి సెర్ప్ సీఈఓ వీరపాండియన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి 50 పింఛన్లకు ఒక బృందం చొప్పున 12 బృందాలు తనిఖీలు నిర్వహించాయి. సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలరింగ్ ఇచ్చుకునేందుకు సర్వే బృందంలో ఇతర మండలాలకు చెందిన ఒక గెజిటెడ్ అధికారిని, సచివాలయ ఉద్యోగిని నియమించారు. బృందాలు పింఛను పొందుతున్న లబ్ధిదారు వద్దకు వెళ్లి తనిఖీ చేపట్టారు. అందులో వెల్లడైన విషయాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సాయంత్రానికి పరిశీలన పూర్తి చేశారు. తాడిమళ్ల-1 సచివాలయంలో 472 వివిధ రకాల పింఛన్ల తనిఖీ పూర్తయింది.

**పరిశీలనలో 13 అంశాలు**

సామాజిక భద్రత పింఛన్ల పరిశీలనలో 13 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. వాటిపై బృందంలోని సభ్యులు వివరాలు సేకరించారు. ప్రభుత్వానికి నివేదించారు. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ అందగానే తొలగింపు ప్రక్రియ చేపడతారు. ప్రధానంగా దివ్యాంగులు, వితంతు పింఛన్లపై ఫోకస్ పెట్టారు.

- పింఛనుదారు కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు ఆపైన ఉందా?.
- లబ్ధిదారుడి కుటుంబానికి మూడెకరాల కంటే ఎక్కువ మాగాణి, పదెకరాల కంటే ఎక్కువ మెట్ట ఉందా? లేదా రెండూ కలిపి పదెకరాల కంటే ఎక్కువ భూమి ఉందా? అని ఆరా తీస్తున్నారు.
- కుటుంబంలో ఎవరైనా నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్నారా?.(టాక్సీ, ట్రాక్టర్లు, ఆటోలకు మినహాయింపు)
- కుటుంబంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగి, పెన్షనర్ ఉన్నారా? అని ప్రశ్నిస్తున్నారు.
- విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువగా ఉందా?
- కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా?
- దివ్యాంగులకు సంబంధించి వికలత్వం కలిగి ఉన్నారా?
- పింఛన్‌దారుడి (రీ అసెస్‌మెంటు), వైద్య పరీక్షకు సిఫారసు చేస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రత్యేకంగా ఉన్నాయి.
- వితంతు, ఒంటరి మహిళలకు సంబంధించి పునర్వివాహం చేసుకున్నారా..? అనే ప్రశ్న ప్రత్యేకంగా ఉంది.
- ఆయా ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసిన అనంతరం పింఛను కొనసాగించేందుకు సిఫారసు చేస్తున్నారా? లేదా? అనే విషయాన్ని తనిఖీ చేసే ఉద్యోగి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం పింఛను దారుని ఫొటో క్యాప్చర్ చేస్తున్నారు.

**త్వరలో జిల్లా వ్యాప్తంగా...**

తొలి దశలో పైలెట్ ప్రాజెక్టుగా సచివాలయాన్ని ఎంపిక చేసిన కూటమి సర్కారు త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో తొలగింపు ప్రక్రియకు నాంది పలకనున్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 2,37,389 పింఛన్లు అందజేస్తున్నారు. రానున్న రోజుల్లో వేల సంఖ్యలో పింఛన్లు తగ్గించే కుట్రలు సాగుతున్నాయి. టీడీపీ నేతలు చెప్పిన వారిని తొలగించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.



తాడిమళ్ల-1 సచివాలయం పరిధిలో పింఛన్ల వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

# 'హరి'కథ వింటే మంచిది



రుక్మిణీ కల్యాణాన్ని పర్యవేక్షిస్తున్న రామానుజ జీయర్ స్వామి

రాజమహేంద్రవరం రూరల్: 'హరి' కథ విన్నా, శ్రవణం చేసినా వారికి మంచి జరుగుతుందని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అభిభాషించారు. హరికి సంబంధించిన కథలు భాగవతంలో ఎన్నో ఉన్నాయన్నారు. ఏడురోజుల్లో చనిపోతానని తెల్సిన పరీక్షిత్తు మహారాజు ఎలాగో చనిపోతాం కనుక ఏమిచేస్తే మంచిదని భావించి, అడిగితే 'హరి' కథ వింటే మంచిదని శ్రీ శుకుడు చెబుతాడని ఆయన తెలిపారు. ఆ విధంగా 'హరి'కథ చెప్పడం శ్రీ శుకుడు మొదలుపెట్టాడని అన్నారు. రాజవోలు గాయత్రీనగర్ రామాలయం దగ్గర ఈ నెల 4వ తేదీ నుంచి అహోబిల రామానుజ జీయర్ స్వామి చేస్తున్న శ్రీ మద్భాగవత సప్తాహం దిగ్విజయంగా ముగిసింది. బుధవారం రామానుజ జీయర్ స్వామి భక్తులతో ఓం నమో భగవతే వాసుదేవాయ, జై శ్రీమన్నారాయణ జై జై, జై లక్ష్మీనారాయణ జై జై అని పలికింపజేశారు . శ్రీ మద్భాగవతంలో ఒక్క శ్లోకం అర్థం తెలిస్తేనే ఎంతో ఫలితం ఉంటుందని, అలాంటి భాగవతం ఏ కొంచెం చవి చూసినా మంచి ఫలాలు అందుతాయని అయన అన్నారు. ఇందులోని 12స్కంధాలు స్వామివారి అవయవాలని చెప్పారు. అనంతరం అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ రుక్మిణీ కల్యాణం వైభవంగా నిర్వహించారు.

# రైతుల పక్షాన పోరు

- రేపు ర్యాలీ, ధర్నా, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణుగోపాల కృష్ణ
- దేవరపల్లిలో సమావేశమైన పార్టీ నేతలు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో సమావేశమైన పార్టీ నాయకులు

దేవరపల్లి: రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాల్లో హోం శాఖ మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అధ్యక్షతన బుధవారం పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేణు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను దగా చేయడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై జిల్లాలో ఈ నెల 13 నుంచి జనవరి 3వ తేదీ వరకు పార్టీ ఆధ్వర్యంలో వివిధ ఆందోళనలు చేపడుతున్నట్టు తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ వద్ద ఉదయం 10 గంటల నుంచి పార్టీ నాయకులు, రైతు సంఘాలతో ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలు, ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం బొమ్మూరులోని పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, గోపాలపురం రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చెలికాని రాజబాబు, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, చాగల్లు మాజీ సర్పంచ్ గంధ్రోతు సురేంద్ర పాల్గొన్నారు.

# గీత మానవ జీవితానికి ప్రతీక



ఇస్కాన్‌లో సాగిన గీతా యజ్ఞం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): శ్రీకృష్ణ భగవానుడు బోధించిన గీత మానవ జీవితానికి ప్రతీకని సత్యగోపినాథ్‌దాస్ ప్రవచించారు. బుధవారం స్థానిక ఇస్కాన్ టెంపుల్‌లో గీత జయంతి సందర్భంగా గీతాయజ్ఞం నిర్వహించారు. గీతలోని శ్లోకాలను చదువుతూ యజ్ఞం పూర్తి చేశారు. అనంతరం 1,000 మంది పేద విద్యార్థులకు భగవద్గీతలను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక వస్తువు కొన్నప్పుడు దానిని ఎలా వాడాలో తెలిపే మాన్యువల్ ఉంటుంది. దాని ప్రకారం ఆ వస్తువును సులభంగా వాడవచ్చు. అదేవిధంగా శ్రీకృష్ణభగవానుడు సృష్టించిన మనుషులు ఎలా జీవించాలి, ఏ విధంగా నడుచుకోవాలి అనే అంశాలను భగవద్గీత అనే మాన్యువల్‌లో విపులంగా వివరించారన్నారు. భగవద్గీత చదివితే మనిషి జన్మకు సార్థకత ఏర్పడుతుందన్నారు. నేడు ప్రపంచం అంతా మేనేజ్‌మేంట్ స్కిల్ నేర్పిస్తూ భగవద్గీతని అధారంగా చేసుకుందన్నారు. కాని మన వారు మాత్రమే గీతను ఎప్పుడో గుర్తుకువచ్చినప్పుడు చదువుతున్నారన్నారు. నేటి యువత గీతను చదివి అనేక విషయాలు తెలుసుకోవచ్చన్నారు. శివనాంద నిమాయదాస్, హేమ నిమాయదాస్, శ్యామంగా దాస్, రవీంద్రచైతన్యదాస్, తదితరులు పాల్గొన్నారు.

# కర్బన ఉద్గారాలను తగ్గించే చర్యలు

- ఐఓసీఎల్‌తో ఉమ్మడి ప్రణాళిక
- సీటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ శేషమాధవ్



ఒప్పంద పత్రాలతో సీటీఆర్‌ఐ డైరెక్టర్ శేషమాధవ్, యోగారాణి సురేష్, పీవీ లలిత తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో బుధవారం సంస్థ కార్యాలయంలో హైదరాబాద్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎమినెంట్ గ్యాస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నామని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్‌ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేష మాధవ్ తెలిపారు. వర్జీనియా పొగాకు క్యూరింగ్ విధానానికి కలపకు బదులుగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)ను వాడుకునేందుకు సాంకేతికతను అభివృద్ధి చేసుకోవడం, విశ్లేషణ, రైతులకు అందించడానికి మొట్ట మొదటిసారి ఒక అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఆ దిశగా పరిశోధనలు వేగవంతం చేసేందుకు, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఒక ప్రాజెక్టును పెద్ద మొత్తంలో ప్రారంభించారన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రాబోయే సంవత్సరాలలో మన తెలుగు రాష్ట్రాలలో 40,000 పైచిలుకు ఉన్న పొగాకు బ్యారన్‌లలో కలప వినియోగం గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. దాని వల్ల రైతులకు కలప సంబంధిత సమస్యలతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. పర్యావరణానికి శూన్య ఉద్గారాల దిశగా పొగాకు పంట ఉంటుందని వివరించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి జనరల్ మేనేజర్ యోగ రాణి సురేష్, చీఫ్ మేనేజర్ పీవీ లలిత, మేనేజర్ డి.భాస్కర్, అసిస్టెంట్ మేనేజర్, వి.గోపాల్, ఎమినెంట్ గ్యాస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి డైరెక్టర్ ఎం.ఎస్.కిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు. సీటీఆర్‌ఐ శాస్త్రవేత్తలు, నిపుణులు డాక్టర్ ఎల్.కె. ప్రసాద్, డాక్టర్ సి.చంద్రశేఖరరావు, డాక్టర్ హెచ్.రవిశంకర్, కె.విశ్వనాథరెడ్డి, డాక్టర్ బి.హేమ, పొగాకు అభ్యుదయ రైతు వాసు పాల్గొన్నారు.

# ఉద్యోగం ఊడింది.. లంచం డబ్బు తిరిగివ్వండి

- కొలువులు కోల్పోయిన అభ్యర్థుల గగ్గోలు
- తమను మభ్యపెట్టిన డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారిపై గుర్రు

కాకినాడ క్రైం: 'మీకు పర్మినెంట్ ఉద్యోగం గ్యారంటీ అని చెప్పి మా దగ్గర లంచాలు తీసుకున్నారు. ఇప్పుడేమో ఆ ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డాం. మా దగ్గర తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వండి.' అని ఎంపీహెచ్‌ఏ (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్)ల అడుగుతున్నారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఈ వివాదానికి కేంద్ర బిందువైంది.

అసలేం జరిగిందంటే... 2002లో రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్‌ఏ మేల్ అభ్యర్థుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ఆధారంగా అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 217 పోస్టుల భర్తీకి సన్నాహాలు చేశారు. పదవ తరగతి అర్హతతో ఈ ఉద్యోగ నియామకాలు జరిగాయి. రాత పరీక్ష, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. అయితే పదవ తరగతి పూర్తి చేశామని దరఖాస్తు చేసుకున్న కొందరు ప్రైవేటు పాఠశాలల్లో చదువు పూర్తి చేయగా వారి సర్టిఫికెట్ల వాస్తవికతపై అనుమానాలు వ్యక్తమై అనుమతించలేదు. ఈ విషయంపై అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. నిర్ణీత 217 పోస్టులకు అదనంగా సుమారు 125 మంది తమ అర్హతను ప్రస్తావిస్తూ 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ పార్కు వద్ద ధర్నాకు దిగారు. ఎన్నికల ముందు వివాదాలకు చెక్ పెట్టాలనుకున్న అప్పటి ప్రభుత్వం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ పేరుతో ఓ కమిటీ వేసింది. వారి సిఫారసుతో మెరిట్, రోస్టర్‌ల అవసరం లేకుండా ఉద్యోగాలు ఇచ్చేయాలని తీర్మానించింది. దీంతో అప్పటి ప్రభుత్వం 1207 జీవో ద్వారా, నిరసనకు దిగిన 125 మందికి నియామక నిబంధనలు తుంగలో తొక్కి రాజకీయ ప్రయోజనం కోసం ఉద్యోగాలు ఇచ్చేసింది. దీంతో జిల్లాలో ఎంపీహెచ్‌ఏ మేల్ సంఖ్య 217కి బదులు 342కి చేరింది. మెరిట్, రోస్టర్‌కు తావు లేకుండా కేవలం నిరసనతో ఉద్యోగాలు పొందిన వీరి వ్యవహారంపై మెరిట్ ఉన్న కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అలా వ్యక్తిగతంగా ఆశ్రయిస్తూ కోర్టు ఆర్డర్లు తెచ్చుకోవడం మొదలు పెట్టారు. ఇలా కోర్టును ఆశ్రయించిన వారి సంఖ్య సుమారు 150 మంది కాగా, వారందరూ ఉద్యోగాలు పొందారు. ఈ నియామకాలతో కలిపి ఎంపీహెచ్‌ఏల సంఖ్య 492కి చేరింది. అయితే అప్పటి కేసుపై హైకోర్టు కొద్ది రోజుల క్రితం తుది తీర్పు వెలువరించింది. 2002లో నోటిఫికేషన్‌లో ప్రకటించిన 217 పోస్టులు మాత్రమే ఫైనల్ అని స్పష్టం చేసింది. ప్రభుత్వం కోర్టు తీర్పును అనుసరించి కింది కోర్టుల ఉత్తర్వులు, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సిఫారసుతో వచ్చిన వారిని తొలగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో వీరంతా ఉద్యోగాలు కోల్పోయారు. అయితే వీరు నిరసనలు, పోరాటాల దశలో ఉన్నప్పుడు వారి అవసరాన్ని అడ్డుగా పెట్టుకొని కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు డబ్బు దండుకున్నారు. అప్పటి ఇన్‌చార్జి ఏవో పాత్ర కీలకమని బాధితులు అంటున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని, ఇప్పుడు ఉద్యోగం పోయి రోడ్డున పడ్డామనీ ఆ మొత్తాన్ని తమకు తిరిగి ఇప్పించాలని బాధితులు డీఎంహెచ్‌వోను కలిసి వేడుకున్నారు.



కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

# చేనేత సొసైటీని సందర్శించిన కేంద్ర బృందం



పెద్దాపురం చేనేత సొసైటీలో వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పెద్దాపురం: స్థానిక వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీని బుధవారం కేంద్రం బృందం సందర్శించింది. ఢిల్లీకి చెందిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ డీపీఐఐటీ విభాగానికి చెందిన జస్మిన్ కౌర్, నిషేకత్ మిట్టల్ బృందం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ స్కీమ్‌లో భాగంగా బృందం ఇక్కడ వస్త్ర తయారీ విధానంపై ఆరా తీసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు వస్త్ర తయారీకి సంబంధించి వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ స్కీమ్‌కు ఎంపికైతే అంతర్జాతీయ స్థాయిలో చేనేత అమ్మకాలకు వీలుంటుందన్నారు దీనిపై మరింత క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కేంద్రానికి నివేదిక ఇస్తామన్నారు. వారి వెంట రీజనల్ డైరెక్టర్ ధనుంజయరావు, జిల్లా ఏడీ పెద్దిరాజు, సొసైటీ మేనేజర్ తూతిక చంద్రశేఖర్, గాంధీ సొసైటీ మేనేజర్ దొరరాజు, తూతిక సత్యనారాయణ. మల్లిబాబు, బాబురావు, వెంకటరమణ తదితరులున్నారు.

# వెదజల్లుతో సిరుల పంట

- ఈ సాగు విధానంలో ప్రయోజనాలెన్నో..!
- పెట్టుబడులు, సాగునీరు ఆదా
- పది రోజుల పాటు తగ్గనున్న పంటకాలం


కె.బాబూరావు, ఏడీఏ, కరప సబ్ డివిజన్


ఏవీ రాజేష్, ఎంఏఓ, కరప మండలం

**కరప:** జిల్లావ్యాప్తంగా గడచిన కొన్నేళ్లుగా వరి సాగులో వెదజల్లు పద్ధతి బాగా ప్రాచుర్యం పొందింది. వరి సాగులో నారు మడి పెంచి, నాట్లు వేయకుండా నేరుగా విత్తే పద్ధతి (వెదజల్లు) పాటిస్తే, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ పద్ధతి వల్ల వరి నారు పెంచడానికి, నాట్లు వేయడానికి ఖర్చు ఆదా అవుతుంది. సాగునీరు కూడా ఎక్కువ అవసరం ఉండదు, పంట కాలం ఏడు నుంచి పది రోజులు తగ్గుతుందని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్ వివరించారు. వెదజల్లు పద్ధతి అనుసరించే రైతులకు జాగ్రత్తలు తెలిపారు. సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

**ప్రయోజనాలివే..**

ఎకరానికి 12 కిలోల విత్తనాలు చల్లితే సరిపోతుంది. 15 నుంచి 20 కిలోల విత్తనాలు ఆదా అవుతాయి. పంట కాలం వారం నుంచి పది రోజులు తగ్గుతుంది. ఆకు పెంచడం, ఆకుతీత, నాట్లు వేసే పని ఉండదు, రూ 10 వేల సాగు ఖర్చు తగ్గుతుంది. మొక్కల సాంద్రత సరిపడా ఉండటం


కరప మండల కేంద్రంలో వెదజల్లు సాగుకు దమ్ము చేస్తున్న ట్రాక్టర్


వాకాడ గ్రామంలో వెదజల్లిన పొలం

వల్ల దిగుబడి 10 నుంచి 15 శాతం పెరుగుతుంది. సాగునీరు ఆదా అవుతుంది. ఈ పద్ధతిలో మడిలో సూర్యరశ్మి, గాలి బాగా సోకి, చీడపీడల బెడద బాగా తగ్గి, తద్వారా సస్యరక్షణ ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది.

**నేల తయారీ**

విత్తడానికి వారం, పది రోజులు ముందుగా దమ్ము చేసి పొలాన్ని తయారుచేయాలి. చివరి దమ్ము చేసిన తర్వాత పొలంలో ఎత్తుపల్లాలు లేకుండా సమానంగా చదును చేసుకోవాలి. మట్టి పేరుకున్న తర్వాత, బురద పదునులో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. వంతున కాలువలు ఏర్పాటుచేయాలి. వీటిద్వారా ఎక్కువగా ఉన్న నీరు, మురుగు నీరు బయటకు పోవడానికి వీలవుతుంది.

**విత్తనాల రకాలు**

ఈ రబీలో ఎంటీయూ 3626(బొండాలు), ఎంసీ 15(టాటా బొండాలు), ఆర్ఎన్ఆర్ 15048, ఎన్ఎల్ఆర్-34449(నెల్లూరు సన్నాలు) అనువైనవి.

**విత్తన శుద్ధి, విత్తు విధానం**

వెదజల్లు పద్ధతిలో రకాన్ని బట్టి ఎకరానికి 12 కిలోల వరకు విత్తనం అవసరం అవుతుంది. వెదజల్లే విధానంలో విత్తే ముందు ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము బావిస్టిన్ కానీ, 8 గ్రాముల సూడోమోనస్ పొడి మందు ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నాన పెట్టాలి. 24 గంటలు మండికట్టి మొలకెత్తిన విత్తనాన్ని పొలంలో సమానంగా పడేలా వెదజల్లుకోవచ్చు.

**డ్రమ్ము సీడర్‌తో విత్తితే..**

పంట తొలి దశలో వరసల మధ్య కోనోవీడర్‌ను వాడి కలుపు మొక్కలను నేలలో తొక్కివేయవచ్చు.

### కలుపు యాజమాన్యం

నేరుగా విత్తే పద్ధతిలో పండించే పొలాల్లో కలుపు సమస్య అధికంగా ఉంటుంది. సరైన సమయంలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. విత్తిన 35-40 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తిన 1-10 రోజుల మధ్య ఎరేజ్-ఎన్, సిరియస్ 400 మి.లీ.+12 గ్రాములు లేదా ఎరాస్ గోల్డ్ 800 గ్రాములు లేదా కౌన్సిల్ యాక్టివ్ 90 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి, ఒక ఎకరాకు పిచికారీ చేయాలి. వరి నాటిన, వెదజల్లిన 15-25 రోజుల మధ్య నోవ్‌లెక్ట్ 500 మి.లీ లేదా నామినీ గోల్డ్ 100 మి.లీ లేదా ఆల్‌మిక్స్ 8 గ్రాములు లేదా సాథీ 80 గ్రాములు లేదా వివాయా ఒక లీటరు మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి.

### ఎరువుల నిర్వహణ

నాట్ల పద్ధతిలో వేసే విధంగానే ఎరువులు వేయాలి. సిఫార్సు చేసిన ఎరువుల్లో పూర్తి భాస్వరాన్ని, సగం పొటాష్ ఎరువును దమ్ములో వేయాలి. సిఫార్సు చేసిన నత్రజని(యూరియా) ఎరువును మూడు సమ భాగాలు చేసి, విత్తిన 15 రోజుల్లోపు, పిలకలు తొడిగే దశలో, అంకురం ఏర్పడే దశలో వేయాలి. దమ్ములో నత్రజనిని వేయరాదు. ఎందుకంటే కలుపు ఎక్కువగా వస్తుంది. మిగిలిన సగం పొటాష్‌ను అంకురం ఏర్పడే దశలో నత్రజనితో కలిపి వేయాలి. దాళ్వాలో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ దమ్ములో వేయాలి. పైరుపై జింక్‌లోపం కనిపిస్తే.. జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు ఒక లీటరు నీరు వంతున కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

## పాడి-పంట

### నీటి యాజమాన్యం ఇలా..

**విత్తిన తర్వాత** మొక్కలు మొదటి ఆకు **పూర్తిగా విచ్చుకునే** వరకు (సుమారు 7-10 **రోజులు) నీరు** నిల్వ ఉండకుండా, పొలం **తడిగా ఉంచాలి** (ఆరుతడులు ఇవ్వాలి). **మొక్క 4, 5 ఆకులు** తొడిగిన తర్వాత పొలంలో పలచగా అంటే 2, 3 సెం.మీ. లోతు నీరుంచాలి. అంతకుమించి నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు చేయదు. పైరు పిలక తొడిగి దుబ్బు కట్టుట పూర్తయ్యాక కోతకు పది రోజుల ముందు వరకు మడిలో 5 సెం.మీ. లోతు నీరుంచాలి.

కలుపు మందు వేసిన 4, 5 రోజుల వరకు నీరు బయటకు పోకుండా చూడాలి.

**సస్యరక్షణ**

నేరుగా విత్తే పద్ధతిలో పురుగులు, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుంది. మొక్కకు గాలి, వెలుతురు బాగా ప్రసరించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి, అందువల్ల సస్యరక్షణకు అయ్యే ఖర్చు కూడా తగ్గుతుంది. అవసరాన్ని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఆయా సమయాల్లో వ్యవసాయ నిపుణులను సంప్రదించి, వారి సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

## ప్రయాణికులకు సెల్‌ఫోన్ల అప్పగింత


సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

**తుని:** రైళ్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ప్రయాణికులకు అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేసి అందజేశామని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ప్రయాణికులు పోగొట్టుకున్న 34 సెల్‌ఫోన్లను విజయవాడ రైల్వే ఎస్పీ, రాజమహేంద్రవరం డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు బుధవారం తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత వ్యక్తులకు అందజేశామన్నారు. వీటి విలువ రూ.7,04,600 ఉంటుందన్నారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

# బాలుడి మృతదేహం లభ్యం

**కారు ప్రమాదంలో మూడుకు చేరిన మృతులు**


మనోజ్ మృతదేహం

**పి.గన్నవరం:** ఊడిమూడి శివారు ఆర్బీ రోడ్డులో చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారుజామున ప్రధాన పంట కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో గల్లంతైన నేలపూడి మనోజ్(5) మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈ ప్రమాదంలో కాలువలో పడి తల్లితో పాటు, ఇద్దరు కుమారులు మరణించడంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయకుమార్ తన భార్య ఉమ(31), కుమారులు రోహిత్(9), మనోజ్(5) అరకు నుంచి ఇంటికి తిరిగొస్తుండగా, వారు ప్రయాణిస్తున్న కారు చింతావారిపేట వద్ద అదుపుతప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకెళ్లిన విషయం విదితమే. తల్లి ఉమ, పెద్ద కుమారుడు రోహిత్ మృతదేహాలు అదే రోజు లభ్యం కాగా, చిన్న కొడుకు మనోజ్ మృతదేహం సంఘటన స్థలికి వంద మీటర్ల దిగువన బుధవారం లభ్యమైంది. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై బి.శివకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి**

ఈ ఘటనలో భార్య, ఇద్దరు కుమారులను కోల్పోయిన బాధితుడు విజయకుమార్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పోతవరంలో బాధిత కుటుంబాన్ని బుధవారం ఆమె పరామర్శించారు. సర్పంచ్ వడలి కొండయ్య, మాజీ సర్పంచ్ గుత్తుల దాసు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# అట్టహాసంగా చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

**ప్రారంభించిన సినీ నటి శ్రీలీల**

**రాజమహేంద్రవరం సిటీ:** వస్త్ర, బంగారు ఆభరణాల ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని పొందిన చెన్నై షాపింగ్ మాల్ చారిత్రక రాజమహేంద్రవరంలో ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్‌ని బుధవారం సినీ నటి శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, రూ.99 నుంచే వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని, కాంబో ఆఫర్లు ఇస్తున్నామని తెలిపారు. బంగారు ఆభరణాలను అతి తక్కువ తరుగు, అలాగే మజూరి లేకుండా చెన్నై షాపింగ్ మాల్ అందిస్తోందని చెప్పారు. సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ, రాజమహేంద్రవరం ప్రాంత ప్రజలు వస్త్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడానికి చెన్నై వెళ్లనవసరం లేకుండా, చెన్నై షాపింగ్ మాల్ వారి చెంతకు వచ్చిందన్నారు. నాణ్యతతో పాటు, నమ్మకమైనది చెన్నై షాపింగ్ మాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు హాజరయ్యారు. ఇంకా ప్రముఖులు చెరుకూరి కృష్ణాజీ, బుడ్డిగ శ్రీనివాస్, సూరవరపు శ్రీనివాస్, మన్యం ఫణి, భీమశంకరం, చలుమూరి శ్రీనివాస్, ఇన్నమూరి దీపు, పలువురు వ్యాపారవేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.


చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభించి, షోరూంలో ఆభరణాలు చూపుతున్న సినీ నటి శ్రీలీల



## క్లాట్‌లో 'డ్యాఫ్నీ' విద్యార్థుల సత్తా


స్నేహితశ్రీ


రోహిణీకాంత్ గాంధీ


వివేక్

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం):** ప్రముఖ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి నిర్వహించే క్లాట్(కామన్ లా అడ్మిషన్ టెస్ట్)లో డ్యాఫ్నీ సివిల్స్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. శ్రీషిర్డీ సాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య ఈ వివరాలను వెల్లడించారు. ఈ విద్యాసంస్థల ఆధ్వర్యంలోని అకాడమీలో శిక్షణ పొందిన ఎస్.స్నేహితశ్రీ జాతీయ స్థాయి 15వ ర్యాంకు సాధించగా, జి.రోహిణీకాంత్ గాంధీ 52, డి.వివేక్ 97, జి.గణేష్ 104 ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. వెయ్యిలోపు మొత్తం 20 మంది ర్యాంకులను సాధించినట్టు వివరించారు. హాజరైన 77 మందిలో 30 మందికి పైగా వివిధ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు సీట్లు సాధించగలరన్నారు. ఏటా తమ విద్యార్థులు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలకు ఎంపిక కావడంపై విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. ర్యాంకులు పొందిన విద్యార్థులు, అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్లు టి.శ్రీవిద్య, శ్రీలేఖ అభినందించారు.

## దగ్ధమైన బ్యాటరీ బైక్



**రాజానగరం:** బ్యాటరీ బైక్ అయితే పెట్రోలు, డీజిల్ బాధలు ఉండవని అంతా భావిస్తుంటారు. బ్యాటరీ పేలితే పరిస్థితి దారుణంగా ఉంటుంది. మండలంలోని చక్రద్వారబంధంలో బుధవారం అదే జరిగింది. బైక్ యాజమాని అపాయాన్ని ముందుగానే పసిగట్టడంతో ప్రాణాలతో బయటపడ్డారు. బైకు మాత్రం మంటలకు ఆహుతైంది. వివరాలిలా ఉన్నాయి. చక్రద్వారబంధానికి చెందిన చిక్కాల రాఘవ ఏడాది క్రితం రాజమహేంద్రవరంలోని ఓ షోరూమ్‌లో బ్యాటరీ బైకును కొనుగోలు చేశారు. బుధవారం కూడా పొలానికి వెళ్లి, సాయంత్రం ఇంటికి తిరిగొస్తుండగా, సీటు దిగువ ఉన్న బ్యాటరీ నుంచి చిటపట మంటూ శబ్దం రావడాన్ని గమనించారు. బైకును ఆపి, చూస్తే ఆ బ్యాటరీ నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసి, బైకు అంతటా వ్యాపించి, కాలి బూడిదైపోయింది. బైకును కొనుగోలు చేసిన షోరూమ్ నిర్వాహకులకు ఫోన్ చేయగా, గ్యారంటీ పీరియడ్ ఏడాదేనని, తాము చేసేమీలేదంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

## లారీ ఢీకొని టీచర్ మృతి

**కొవ్వూరు:** ఐ.పంగిడి గ్రామ శివారున పెట్రోలు బంక్ సమీపంలో మంగళవారం రాత్రి మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఆరేపల్లి అనిల్ కుమార్(31) మృతి చెందారు. అతడు కాతేరులోని తిరుమల స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని తిరిగి స్వగ్రామమైన ఐ.పంగిడి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ చేరుకునే సరికి అతడు చనిపోయినట్టు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. అవివాహితుడైన అనిల్‌కుమార్ తండ్రి గతంలోనే మరణించారు. తల్లితో పాటు అతను కలిసి ఉంటున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో చికెన్ వ్యాపారి మృతి

**రంగంపేట:** విద్యుదాఘాతానికి గురై చికెన్ వ్యాపారి మృతి చెందినట్టు ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. ఈలకొలను గ్రామానికి చెందిన కురుకూరి అన్నవరం(50) గ్రామంలో చికెన్ దుకాణం నడుపుతున్నాడు. బుధవారం ఉదయం తన భార్య మంగాదేవితో కలసి దుకాణానికి వెళ్లాడు. స్విచ్‌బాక్సును ముట్టుకోవడంతో అన్నవరంతో పాటు, అతని భార్య కూడా విద్యుదాఘాతానికి గురయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని బంధువులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే అన్నవరం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. భార్య మంగాదేవి చికిత్స పొందుతోంది. మృతుడి కుమారుడు కురుకూరి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జల్సాల కోసం చోరీల బాట

- పోలీసులకు పట్టుబడిన నలుగురు యువకులు
- 29 మోటార్ సైకిళ్లు స్వాధీనం


రికవరీ చేసిన వాహనాలతో సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం):** జల్సాలు, దుర్వ్యసనాలకు గురైన నలుగురు యువకులు చోరీల బాట పట్టారు. అనేక ద్విచక్ర వాహనాలను దొంగిలించి, తుదకు పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ముగ్గురు మైనర్లు కావడం విశేషం. రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో ఇటీవల మోటార్ సైకిళ్ల దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిఘా పెంచారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ వి.అప్పారావు, ఎస్సై వి.అప్పలరాజు సిబ్బందితో కలిసి కాతేరు గామన్ వంతెన వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నలుగురు యువకులు మోటార్ సైకిళ్లపై అనుమానాస్పదంగా తారసపడడంతో, వారిని అదుపులోకి తీసుకుని ఆరా తీశారు. వీరిలో వీవర్స్‌కాలనీకి చెందిన కుప్పం తేజతో పాటు, మరో ముగ్గురు మైనర్లు ఉన్నారు. వీరు జల్సాలు, దురలవాట్లకు బానిసలై, డబ్బు కోసం మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడ్డారు. ఇళ్ల ముందు, ఇతర ప్రాంతాల్లో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను మారు తాళంతో తీసి, వాటిని కొంతకాలం దాచిపెట్టారు. వాటిని ఒక్కొక్కటిగా అమ్మి,, వచ్చిన డబ్బుతో అవసరాలు తీర్చుకునేవారు. వీరితో పాటు కొంతమూరుకు చెందిన శ్రీరామ్ అనే యువకుడు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. వీరంతా రూ.11.60 లక్షల విలువైన 29 మోటార్ సైకిళ్లను దొంగిలించారు. కొన్ని మోటార్ సైకిళ్లను కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన వాడబోయిన రమేష్, గుర్రాల వెంకన్న, దేవేన రాజు అనే వ్యక్తులకు అమ్మారు. మిగిలిన వాటిని రాజమహేంద్రవరం క్వారీ గోతుల వద్ద దాచారు. వీరి నుంచి 29 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కుప్పం తేజను న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించగా, ముగ్గురు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. ఇలా ఉండగా యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా వారి తల్లిదండ్రులు, పెద్దల పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ నరసింహకిషోర్ చెప్పా రు. ఎప్పటికప్పుడు వారి నడవడికపై దృష్టి పెట్టాలన్నారు. కేసులో విశేష కృషి చేసిన డీఎస్పీ రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఎస్సై అప్పలరాజు హెచ్ సీలు టి.లోవకుమార్, ఎం.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు విజయ్, పవన్, కె.శ్రీనివాసరావును అభినందించారు.